TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 298 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.24.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి..అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### -- టెంపుల్ సిటీ లో వేద పాఠశాలకు శంకుస్థాపన

### -- అనంతరం నరసింహున్ని దర్శించుకున్న సీఎం









యాదగిరిగుట్ట :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించారు. ఉదయం 8:50 నిమిషాలకు హెలికాప్టర్లో యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎంరేవంత్ రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కి ప్రభుత్వ విప్ ఆలేర్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నేరుగా టెంపుల్ సిటీలో 43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వేద పాఠశాల పనులకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతితో కలిసి సీఎం భూమి పూజ నిర్వహించారు. 100 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ఆయన అక్కడే శంకుస్థాపన చేశారు. అనంతరం యాదగిరి కొండపైకి చేరుకున్న సీఎంకి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వయంభులను దర్శనం చేసుకున్న అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేపట్టారు. దేవస్థానం ఈవో భవాని ప్రసాద్ ధర్మకర్త నర్సింహమూర్తిలు సీఎంకి మంత్రులకు స్వామి వారి జ్ఞాపికను ప్రసాదాలను అందజేశారు. దర్శన అనంతరంలో సీఎం హైదరాబాద్ కు వెళ్లారు.

## విద్యా, ఆర్థిక సాధికారతలతో సామాజిక స్థాయి మెరుగు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:విద్యా, ఆర్థిక సాధికారతలతో సామాజిక స్థాయి పెరుగుతుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యా నించింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల్లోని పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలు ఇంకా కొనసాగుతుండడాన్ని సుప్రీం కోర్టు శుక్రవారం ప్రశ్నించింది. తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లైనందున పిటిషనర్‌ను రిజర్వేషన్ నుంచి మినహాయించడాన్ని సమర్థిస్తూ కర్నా టక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులు, అటువంటపుడు వారికి ఎందుకు రిజర్వేషన్లు కల్పించాలి? విద్యా, ఆర్థిక సాధికారతలతో సామాజిక స్థాయి పెరుగుతుంది. అటువంటపుడు, మళ్ళీ వారి పిల్లలకు ఎందుకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారు. ఇలా అయితే ఈ రిజర్వేషన్ వ్యవస్థ నుండి మనం ఎప్పటికీ బయటకు రాలేం" అని బెంచ్ వ్యాఖ్యానించింది. విద్యార్థుల తల్లిదండ్రులు మంచి ఉద్యోగాల్లో వుండి, ఆకర్షణీయమైన వేతనాలు పొందుతుంటే, అటువంటి సంపన్న వర్గాలను రిజర్వేషన్ ప్రయోజనాల పరిధి నుండి బయటకు తీసుకురావాలని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ విషయంలో అటువంటి సంపన్న వర్గాలకు రిజర్వేషన్లు మినహాయిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అనేక ఉత్తర్వులు జారీ చేసిందని బెంచ్ పేర్కొంది. కానీ వాటిని ఇప్పుడు సవాలు చేస్తున్నారని పేర్కొంది. "ఆర్థికంగా బలహీన వర్గాలకు, వెనుకబడిన గ్రూపులకు సామాజిక వెనుకబాటుతనం అంటూ ఏమీ వుండదు, కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే వుంటుంది. ఇక్కడ కొంత సమతుల్యత పాటించాల్సి వుంది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం వుంటుంది, నిజమే, కానీ, రిజర్వేషన్ ప్రయోజనాలను అవకాశంగా తీసుకుని తల్లిదండ్రులు ఒక స్థాయికి చేరుకున్నారు." అని బెంచ్ వ్యాఖ్యానించింది.




రిజర్వ్‌డ్ కేటగిరీ కింద కర్నా టక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో పిటిషనర్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)గా నియామకానికి సెలక్ట్ అయ్యాడు. అయితే జిల్లా కులాలు, ఆదాయాల నిర్ధారణ కమిటీ పిటిషనర్‌కు కుల ధ్రు వీకరణ సర్టిఫికెట్‌ను ఇవ్వడానికి నిరాకరించింది. క్రీమీ లేయర్ పరిధిలోకి పిటిషనర్ వచ్చినందున తాము సర్టిఫికెట్ ఇవ్వలేమని తేల్చి చెప్పింది. పిటిషనర్ తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులని, వారిద్దరి ఆదాయం నిర్దేశిత క్రీమీ లేయర్ పరిధి రూ. 8లక్షలను కూడా దాటి పోయిందని అధికారులు తెలిపారు. దాంతో కురుబ కమ్యూనిటీకి చెందిన వ్యక్తిగా పేర్కొంటూ ఇచ్చిన కుల సర్టిఫికెట్‌ను రద్దు చేశారు.

## డబ్ల్యూ ఎఫ్ఐపై ఢిల్లీ హైకోర్టు మండిపాటు

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: దేశీయ పోటీల్లో పాల్గొనడానికి రెజ్లర్ వినేష్ ఫోగట్ ను అనర్హురాలిగా ప్రకటించిన నిర్ణయంపై ఢిల్లీ హైకోర్టు మండిపడింది. ఈ నిర్ణయంపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ ఐ)ని తీవ్రవంగా మందలించింది. రానున్న ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌లో ఫోగాట్ పాల్గొనడాన్ని ఖరారు చేయడానికి, అలాగే ఆమె ఫిట్‌నెస్‌ను మూల్యాంకనం చేసేందుకు తక్షణమే ఒక నిపుణుల కమిటీని నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో మాతృత్వాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రసూతి సెలవుల అనంతరం వినేష్ ఫోగట్ తిరిగి క్రీడల్లోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ.. గత ఎంపిక ప్రమాణాలను పక్కనబెట్టి డబ్ల్యు ఎఫ్ ఐ వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టింది. విరోధమేదైనా లేదా వివాదమేదైనా కావచ్చు.. కానీ రెజ్లింగ్ ప్రయోజనాలను ఎందుకు దెబ్బతీయాలని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పారిస్ ఒలింపిక్స్ లో బరువు పరిమితిని పాటించకపోవడం, డోపింగ్ నిరోధక సమస్యలు, ఒలింపిక్ క్వాలిఫైర్ ట్రయల్స్ సమయంలో రెండు విభాగాల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ మే 9నడబ్ల్యూఎఫ్ ఐ ఫోగట్ కి షోకాజ్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

2024 పారిస్ ఒలింపిక్స్ నుండి అనర్హురాలిగా ప్రకటించబడిన తర్వాత ఆమె క్రీడలకు విరామం ప్రకటించారు. గతేడాది జులైలో బిడ్డకు జన్మనిచ్చిన ఫోగట్, 2025 డిసెంబర్ 12న తన పదవీ విరమణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. అనంతరం గోండాలో జరిగిన నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఆమె హాజరయ్యారు. అయితే ఆమెను పోటీల్లో పాల్గొనేందుకు డబ్ల్యు ఎఫ్ ఐ అనుమతి నిరాకరించింది. డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం పదవీ విరమణ నుండి తిరిగి వచ్చే క్రీడాకారులు పాటించాల్సిన ఆరు నెలల నోటీసు వ్యవధిని ఆమె పూర్తి చేయలేదని, దీంతో ఆమెను పోటీలకు అనుమతించలేమని డబ్ల్యు ఎఫ్ ఐ పేర్కొంది. డబ్ల్యూఎఫ్ ఐ ఆదేశాలను సవాలు చేస్తూ వినేష్ ఫోగట్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

## తెలంగాణలో భానుడి భగభగ..34 మంది మృతి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం భానుడి భగభగలతో అగ్నిగుండంలా మారుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నిప్పుల వర్షం కురుస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత, వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతూ, రాష్ట్రంలో ఇప్పటివరకు వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. వాతావరణ శాఖ రాష్ట్రంలోని 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. పగటిపూట బయటకు రావాలంటేనే ప్రజలు భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు. నిన్న రాష్ట్రంలోనే అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)లో 46.5 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, సూర్యాపేట సహా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46.4 డిగ్రీలుగా రికార్డయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 16 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46.2 నుంచి 46.5 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. నిన్న ఒక్కరోజే 244 మండలాల్లో తీవ్రమైన ఎండల ప్రభావం కనిపించింది. సూర్యాపేట జిల్లాలోని 22 మండలాల్లో, మంచిర్యాల, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో 18 చొప్పున మండలాల్లో వడగాలులు వీచాయి.

రానున్న నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించాయి. ఈనెల 26 వరకు పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొన్నాయి.

## పాలిసెట్ ఫలితాలు..అమ్మాయిలదే పైచేయి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ:తెలంగాణలో పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని సాంకేతిక భవన్‌లో. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఈ ఏడాది కూడా పాలిసెట్ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయిసాధించారు. బాలుర ఉత్తీర్ణత 79.92 శాతం నమోదు కాగా.. బాలికలు ఏకంగా 86.38 శాతంతో టాప్‌లో నిలిచారు. మొత్తం 120 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో.. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు కనీస ఉత్తీర్ణత మార్కులుగా 36 మార్కులు నిర్ణయించారు. కాగా, ఎస్సీ, ఎస్టీ (రాజ, గూ) అభ్యర్థులకు కనీస ఉత్తీర్ణత మార్కుల నుండి మినహాయింపు ఇచ్చారు. మే 13న రాష్ట్రవ్యాప్తంగా పాలిసెట్ పరీక్ష నిర్వహించగా.. మొత్తం 1,06,439 మంది దరఖాస్తు చేసుకోగా.. 98,029 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 81,307 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 82.94 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

## బొగ్గు గనిలో పేలుడు.. 82 మంది మృతి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: చైనాలోని లియుషెన్యూ బొగ్గుగనిలో పేలుడు సంభవించింది. ఇవాళ ఉదయం జరిగిన ఈ ఘటనలో ఇప్పటి వరకు 82 మంది ప్రాణాలు కోల్పోయారు. తొలుత తక్కువ సంఖ్యలో మరణాలు సంభవించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, తర్వాత మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ ఘటనలో 9 మంది గల్లంతైనట్లు సమాచారం. ఈ ఘటనపై అధ్యక్షుడు జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్యసేవలు అందించాలని, తక్షణమే ఈ ఘటపై దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

# జిల్లాలో రెండవ విడత 'జలసంచయ్ జనభాగీదారి 2.0' కార్యక్రమం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో రెండవ విడత 'జలసంచయ్ జనభాగీదారి 2.0' కార్యక్రమం అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం నుండి సంబంధిత శాఖల అధికారులతో 'జలసంచయ్ జనభాగీదారి 2.0' కార్యక్రమంపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది నిర్వహించిన జలశక్తి 'జలసంచయ్ జనభాగీదారి 1.0 లో దక్షిణ భారతదేశంలోని జిల్లాలన్నింటిలోనూ అదిలాబాద్ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని, అదే స్ఫూర్తితో ఈసారి కూడా జిల్లాలో సాధించిన మంచి ప్రగతిని చూపిస్తూ, పోర్టల్‌లో ఫోటోలను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 'జలసంచయ్ జనభాగీదారి 2.0' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపాలిటీ, అటవీ శాఖ, ఇరిగేషన్, అగ్రికల్చర్, గ్రౌండ్ వాటర్, హార్టికల్చర్, ఐటీడీఏ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ వంటి దాదాపు 10 నుండి 12 ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,79,000 (లక్షా డెబ్బై తొమ్మిది వేల) ఫోటోలను అప్‌లోడ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లా అధికారులు తమ క్షేత్రస్థాయి సిబ్బందితో పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకొని, నిర్దేశిత లక్ష్యాల ప్రకారం ఫోటోలను సేకరించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి మరోసారి జిల్లాను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలనీ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్, మున్సిపల్ కమీషనర్ జగదీశ్వర్ గౌడ్, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి రాహుల్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర ఎండలు, వడదెబ్బపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రజారోగ్య సూచనలు



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఎండల తీవ్రత మరియు వేడి గాలులు అధికంగా ఉన్నందున, ప్రజలందరూ వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఎండల ప్రభావం అందరిపై ఉన్నప్పటికీ చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరిగా ఉండేవారు మరియు బహిరంగ ప్రదేశాల్లో శారీరక శ్రమ చేసే కార్మికులు ఎక్కువ ప్రమాదంలో ఉంటారని, కాబట్టి వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ వేసవి కాలంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. అందుకోసం రేడియో, టీవీ, వాతావరణ శాఖ ద్వారా వచ్చే స్థానిక వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ఉండాలన్నారు. సాధ్యమైనంత వరకు పగటిపూట ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని, గాలి వెలుతురు వచ్చే చల్లని ప్రదేశాలలో సమయం గడపాలని తెలిపారు. పగటి సమయంలో ఇంటి కిటికీలు, కర్టెన్లు మూసి ఉంచి, రాత్రి వేళల్లో చల్లని గాలి కోసం వాటిని తెరవాలని సూచించారు. అలాగే, బయట పనులను లేదా బహిరంగ కార్యకలాపాలను ఉదయం లేదా సాయంత్రం వంటి చల్లని వేళల్లోనే ప్లాన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవడం వడదెబ్బ నుంచి తప్పించుకోవడానికి ప్రధాన మార్గమని వివరించారు. మీకు దాహం వేయకపోయినా సరే, వీలైనప్పుడల్లా తగినంత నీరు త్రాగాలని, ఎందుకంటే డీహైడ్రేషన్‌ను గుర్తించడానికి దాహం ఒక్కటే సరైన సూచిక కాదని పేర్కొన్నారు. ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. నిమ్మరసం, మజ్జిగ, ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) ఇంట్లో తయారుచేసే పానీయాలలో కొద్దిగా ఉప్పు కలిపి తీసుకోవడం మంచిదన్నారు. వీటితో పాటు పుచ్చకాయ, కర్బూజ, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర వంటి అధిక నీటి శాతం కలిగిన సీజనల్ పండ్లు, కూరగాయలను ఆహారంలో భాగంగా తీసుకోవాలని కోరారు. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వాతావరణానికి తగినట్లుగా సన్నని, వదులుగా ఉండే, లేత రంగు కాటన్ దుస్తులను ధరించడం ఉత్తమమని తెలిపారు. ఎండ దెబ్బ నేరుగా తగలకుండా గొడుగు, టోపీ, టవల్ లేదా సంప్రదాయ తలపాగాతో తలను కప్పుకోవాలని, కాళ్లకు చెప్పులు లేదా బూట్లు తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ఒకవేళ ఎవరికైనా శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరగడం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు లేదా వికారం కావడం, అధికంగా చెమటలు పట్టడం లేదా చెమటలు పూర్తిగా ఆగిపోవడం, స్పృహ తప్పడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. అలాంటి బాధితులను వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, నీరు లేదా ఓఆర్ఎస్ అందిస్తూ, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్య సహాయం అందించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

## :: భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్.లోకేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై శనివారం హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు రెవెన్యూ లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నా మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మే 28 నాటికి మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయంగా ఈ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు ఆదిలాబాదు జిల్లాలో భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఎక్కడా




ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ సవరణలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, నాయబ్ తహసీల్దార్ కవిత, ధరణి కోఆర్డినేటర్ స్వాగత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక: జిల్లాలో 'టూరిజం కిట్' ఆవిష్కరణ

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పర్యాటక రంగాన్ని మరింతగా ప్రమోట్ చేసేందుకు సిద్ధం చేసిన ప్రత్యేక 'టూరిజం కిట్'ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక ప్రాంతాల విశిష్టతను చాటిచెప్పేలా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కిట్‌ను అత్యంత ఆకర్షణీయంగా రూపొందించడం జరిగిందని తెలిపారు. పర్యాటక రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో రూపొందించిన జిల్లా టూరిజం బుక్, పెన్ను, పేపర్ వెయిట్, కీ చైన్‌లతో పాటు టీ కప్పులపై ఉపయోగించే ప్రత్యేక కవర్లను ఈ కిట్ లో పొందుపరచడం జరిగిందని



తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పర్యాటక శాఖాధికారి రవికుమార్, డిఆర్డిఓ రవీందర్, డిఎంహెచ్ఓ నరేందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లాలో జొన్నల కొనుగోళ్ల ప్రక్రియ, రవాణా ఏర్పాట్లపై ఆయన అత్యవసర గూగుల్ మీట్ నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన రవాణా సదుపాయాలు, గిడ్డంగుల ఏర్పాట్లను పక్కాగా పర్యవేక్షించాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ గూగుల్ మీట్ లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్.చిత్రు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి , మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానన్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, డీసీఎస్ఓ నందిని, సివిల్ సప్లైస్ డీఎం సుధారాణి, డీసీఓ, పిన్ పాయింట్ అధికారులు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.

# జొన్న పంట కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపడతాం: జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జొన్న పంట కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపడుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం భైంసా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, జొన్న పంట కొనుగోలు ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జొన్న, మొక్కజొన్న పంట కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేస్తామని అన్నారు. పంట అమ్మకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని వివరించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పూర్తి చేసిన మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ, ఇంకా కొనుగోలు చేయాల్సిన మొక్కజొన్న పంట వివరాలను వివరించారు. ఎక్కడ కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశామని అన్నారు. సరిపడినంత మంది హమాలీలు, లారీల ద్వారా కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, పంటల అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదని అన్నారు. పంట కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పంటల




వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరిపడినన్ని లారీలు, హమాలీలతో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలిస్తూ ఉండాలన్నారు. అధికారులు అంతా క్షేత్రస్థాయిలో పంటల కొనుగోలు విషయంలో పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. భైంసా డివిజన్ మండలాల వారిగా పంటల కొనుగోలు వివరాలను తహసిల్దార్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, భైంసా డివిజన్ తహసిల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డికి సన్మానం చేసిన మాదిగ దండోరా నాయకులు

## మార్కెట్ లో లేబర్ కొరత కూడా తీరేలా జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం:బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ : మాదిగ హక్కుల దండోరా నాయకుల ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతులకు, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి మార్కెట్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జొన్నల కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందని, లారీల కొరత, గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే వెయింగ్, లోడింగ్ పనుల కోసం అవసరమైన లేబర్ కొరత కూడా తీరేలా జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన జొన్నలను నిల్వ చేయడానికి దర్శిత్ ఆగ్రోటెక్ లిమిటెడ్ వారి గోడౌన్‌ను లీజుకు తీసుకున్నామని, రైతులు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ



కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు బందారి అశోక్, మహిళా అధ్యక్షురాలు తోకల గంగమ్మ, గౌరవ అధ్యక్షుడు బొజ్జ అదేళ్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల శివకుమార్, జైనథ్ మండల అధ్యక్షుడు జవారి విట్టల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా.

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు కొనుగోలు చేసిన వరి, మొక్కజొన్న ధాన్యం వివరాలను సమీక్షించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధాన్యం తరలింపునకు అనుగుణంగా లారీలను సమకూర్చుకోవాలన్నారు. తగినంత మంది




హమాలీల ద్వారా తూకం, ధాన్యం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగిన వసతులు ఉండాలన్నారు. అధికారులంతా కొనుగోలు ప్రక్రియ పై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో మార్పు

మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: చదువు ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, కష్టంతో అనుకోకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవడం చాలా సంతోషంగా ఉందని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, రంగారెడ్డి గూడా మాజీ సర్పంచ్ శశికళ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని షారోను మెమోరియల్ చర్చి ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన డాక్టర్ చదువు పూర్తి అయిన 16 మంది విద్యార్థులకు ఘనంగా శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ చదువు ఎంతో కష్టంతో కూడుకున్నదని కష్టపడి చదువుకొని డాక్టర్ అయినందుకు విద్యార్థులను అభినందించారు. పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో ఎంతో మంది పేద ప్రజలు ఉన్నారని వారికి నాణ్యమైన వైద్యాన్ని అందిస్తే ప్రజలు మంచి గుర్తింపు ఇస్తారని చెప్పారు. మండలంలో 16 మంది విద్యార్థులు డాక్టర్లు కావడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. వైద్య విద్య చదువుకున్నందుకు మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు ఎడ్ల శంకర్ ముదిరాజ్, పాస్టర్ రాజారత్నం, సంఘ పెద్ద రత్తమ్మ, అడ్వకేట్ నోవా బిల్ గేట్స్ రెడ్డి, డాక్టర్లు రిషిక, సుప్రజ చంద్ర , రోహిత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు.








అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగ సాధనపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను పెంపొందించుకుని, లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 40 మంది అభ్యర్థులకు జిల్లా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా నియామక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జాతీయ స్థాయి యువ దినోత్సవాల్లో పాల్గొన్న 'పాటె మా ప్రాణం' సంగీత అకాడమీ కళాకారులను, జిల్లా నుండి జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల విజేతలకు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ ఏడీ నరసింహారెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కుర్మే మహేందర్ గారికి మాల మండల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం



అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ నేరడిగొండ మండల కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కుర్మే మహేందర్ గారికి మాల మండల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మాట్లాడుతూ కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రమంగా ఎదిగి అనేక బాధ్యతలు నిర్వర్తించిన కుర్మే మహేందర్ గారికి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు దళిత సమాజానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు ఈ పదవి రావడానికి సహకరించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ కి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ గారికి, మాజీ ఎంపీ సోయం బాపురావు గారికి, ముఖ్యంగా దళితుల ఆశాజ్యోతి, బోథ్ నియోజకవర్గ ముద్దుబిడ్డ ఆడే గజేందర్ కి మాల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మాల సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ అనుపట్ల సంజీవ్ కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆడేళ్లు, మాల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుర్మే నారాయణస్వామి, నాయకులు చిప్పరి రాజేశ్వర్,దావుల శ్రీనివాస్, అరవింద్ కుమార్, దావుల ప్రశాంత్, మద్దెల దయాకర్, నవీన్ కంటిగ, క్రాంతి కుమార్, కృష్ణ, బంటి తదితరులు పాల్గొన్నారు

# దైనందిన జీవితంలో వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి : జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య







అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 23, 2026 : ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, యోగ కు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన క్రీడా ముగింపు కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపల్ రమేష్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18వ తేదీన ఫిట్ ఒ యాక్టివ్ తెలంగాణ, మారథాన్ – ఫిజికల్ లిటరసీ, 19వ తేదీన కెరీర్ ఒ స్కిల్ డెవలప్మెంట్ – ఎం పవర్ స్కిల్స్, ఎం పవర్ ఫ్యూచర్, 20వ తేదీన యూత్ లీడర్ షిప్ సమ్మిట్, 21వ తేదీన ప్లే ఒ పార్టిసిపేట్ – స్పోర్ట్స్ డే, 22వ తేదీన సర్వ్ ఒ సపోర్ట్ – యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ, 23వ తేదీన ఉద్యోగ సాధన – కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్ వంటి కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలలో వివిధ జిల్లా శాఖల అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యకర జీవనశైలి, యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి, ప్లాస్టిక్ రహిత సమాజం తదితర అంశాలపై చర్చలు, చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల అందజేత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమాలు, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని విభాగాలలో విజయవంతం చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్రీడ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దులోనూ అక్రమ రవాణాలను పూర్తిగా అరికట్టాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని అమలు చేయాలి

డయల్ హండ్రెడ్, షి టీం, పోలీస్ అక్క, సైబర్ క్రైమ్ లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

గుడుంబా, గంజాయి, అసంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి.

విధులలో నిజాయితీ, క్రమశిక్షణ తప్పనిసరి.

గాదిగూడ పోలీస్ స్టేషన్ పరిశీలన.





పోలీస్ అధికార్లకు సూచనలు ఇస్తున్న అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మహారాష్ట్ర సరిహద్దు నుండి అక్రమ రవాణా జరగకుండా పూర్తిగా అడ్డుకట్ట వేయగలరని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు గాదిగూడ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరిశీలించడం జరిగింది. మొదటగా ఎస్ఐ రమ్య పూలమొక్క అందజేసి జిల్లా ఎస్పీ కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని తెలిపారు. పోలీసు ప్రతి ఒక్కరూ సక్రమమైన యూనిఫామ్ ధరించాలని, విధులలో నీతి నిజాయితీ, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు గుండా పశువులు, రాయితీ బియ్యం, గుడుంబా, గంజాయి తరలకుండా చర్యలు చేపట్టాలని, మండల పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలనకు వాటి వల్ల కలుగు అనార్థాలపై ప్రజలకు సవివరంగా తెలియజేసి చైతన్య పరచాలని తెలిపారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని, సిబ్బంది విధుల పై పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పర్యవేక్షించాలని, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లోని రిసెప్షన్ ను పరిశీలించి బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. స్టేషన్లో పెండింగ్లో ఉన్న రికార్డులు త్వరితగతిన పూర్తి చేసి ఛార్జ్ షీటు దాఖలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్, ఎస్ఐ రమ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ.మంచిర్యాల జిల్లా మే 23, 2026: కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సింగరేణి క్లబ్, బూదకలాన్ గ్రామంలో గల సింగరేణి క్లబ్ లను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లలో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహసిల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్లును మండల తహసిల్దార్ సదానందం తో

కలిసి పరిశీలించి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యం దిగుమతి వేగంగా చేసుకోవాలని, అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లారీలు రాక జొన్న రైతుల ఆందోళన



బజార్హత్నూర్ అమృత్ తెలంగాణ: బజార్హత్నూర్ జొన్నల మార్కెట్ సహకార సంఘంలో రైతుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. మండలంలోని రైతుల జొన్నలను కాటా చేసి ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటివరకు ఒక్క లారీ కూడా మార్కెట్కు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అకాల వర్షాల కారణంగా మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన జొన్న సంచులు తడుస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రైతులు బజార్హత్నూర్ సహకార సంఘాన్ని ముట్టడి చేసి నిరసన తెలిపారు. అనంతరం సీఓ నారాయణకు వినతిపత్రం అందజేసి తమ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తక్షణమే కనీసం 12 లారీలను ఏర్పాటు చేసి జొన్న సంచులను లోడింగ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రతిరోజూ మార్కెట్ చుట్టూ తిరగాల్సి రావడంతో వ్యవసాయ పనులు కూడా నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం

అశ్వారావుపేట : అమృత్ తెలంగాణ:అశ్వారావుపేట మండలంలో శనివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పురోగతిని పరిశీలించారు. గత సంవత్సరం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మండలంలోని పాత రెడ్డిగూడెం గ్రామపంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి 100 శాతం ఇండ్ల మంజూరు జరిగినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే కొన్ని కుటుంబాలు అనివార్య కారణాల వల్ల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించకపోవడం, మరికొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా ఉండటం, ఇంకొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు నెమ్మదిగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అధికారులు కూడా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకరించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, స్థానిక సర్పంచ్ , పాలకవర్గం సభ్యులు,కాంగ్రెస్ మండల తాజా మాజీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ,తుమ్మ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నయ్యకట్ట చెరువు అలుగు కాలువ మరమ్మతు పనులకు శ్రీకారం

అశ్వారావుపేట.అమృత్ తెలంగాణ: అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం గ్రామ పరిధిలో ఉన్న చెన్నయ్యకట్ట చెరువు అలుగు కాలువ మరమ్మతు పనులను శనివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లాంఛనంగా ప్రారంభించారు. రూ.5.90 లక్షల వ్యయంతో సుమారు 1.50 కిలోమీటర్ల మేర కాలువ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గత వానాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు అలుగు కాలువకు పలు చోట్ల గండ్లు ఏర్పడటంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని చెప్పారు. ఆ నిధులతో గండ్లు పూడ్చడంతో పాటు కాలువను బలోపేతం చేసి భవిష్యత్తులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సరిహద్దులు పోలయ్య, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ జూపల్లి రమేష్ బాబు, నీటి పారుదల శాఖ డీఈ ఎస్.వెంకటేశ్వర్లు,ఏఈ లు ఎల్.శ్రీనివాస్,ఎస్ కే రియాజ్ ,కాంగ్రెస్ మండల తాజా మాజీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, తుమ్మ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు కొనకళ్ల చెన్నారావు, కొల్లు చంద్రశేఖర్, తెల్లగొర్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి





అచ్చంపేట అమృత్ తెలంగాణ: వ్యవసాయం సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని, వివిధ రకాల పంటల సాగులో శాస్త్రవేత్తల సూచనలు రైతులు పాటించాలని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ల ఆధ్వర్యంలో పదర మండలం రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల ముగింపు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అథితులుగా పార్లమెంట్ సభ్యులు మల్లు రవి , ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలు మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ రిజిస్టార్ డా సి.హెచ్. విద్యా సాగర్ మరియు డీన్ డాక్టర్ సి. హెచ్. వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. వరి మొక్కజొన్న, పత్తి లాంటి పంటలే కాకుండా కూరగాయ పంటలు, లాభసాటి పంటలు అపరాలు, చిరుధాన్యాలను పండించాలన్నారు. కోరారు. రైతుల అవగాహన కొరకు శాస్త్రవేత్తలు మరిన్ని శిక్షణ కార్యక్రమాలను అందించాలని శాస్త్రవేత్తలను కోరారు. విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ గ వ్యవసాయ విద్యలో విద్యార్థులకు కల్పించిన అవకాశాలు సదుపాయాలను వివరిస్తూ రైతు కుటుంబం లోని విద్యార్థులను దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. తదుపరి డాక్టర్ సి హెచ్ వేణుగోపాల్ రెడ్డి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్రం మొత్తంలో 1600 గ్రామాలలో 2.5 లక్షల రైతులతో అవగాహన అంశాలను తెలియజేశామన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం నుండి ఎ డి ఆర్ డాక్టర్ ఎల్.కృష్ణ మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను గురించి రైతులకు వివరించారు. వ్యవసాయంలో యూరియా వాడకాన్ని తగ్గించాలని, పశువుల ఎరువులు, జీవన ఎరువుల ద్వారా కొంత మేరకు ఎరువులను ఆదా చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సేంద్రియ వ్యవసాయం వైపు ఆలోచించాలని గ్రామానికి కావలసిన ఆహార పదార్థాలు గ్రామాల్లోనే పండించే విధంగా, రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి డ్రిప్పు మరియు స్ప్రింక్లర్ల వాడకాన్ని పెంచాలని రైతులను కోరారు. సకాలంలో పంటలను విత్తడం ద్వారా పంట చివర్లో నీటి సరఫరా కొరకు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండాలని సూచించారు.

అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శ్రీధర్ మాట్లాడుతూ, పంట మార్పిడి ద్వారా ప్రధానంగా నూనె గింజల సాగు ద్వారా సుస్థిర ఆదాయం సంపాదించడం గురించి వివరించారు. పంట మార్పిడి లో భాగంగా ఆముదం పంట విస్తీర్ణాన్ని పెంచవలసిందిగా కోరారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు మరియు సరైన పద్ధతుల్లో రసాయనాల వినియోగం పై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు మరియు శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో శాస్త్రవేత్తలను రైతులు తమకున్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈశ్వర్ రెడ్డి, స్రవంతి, షైలా, జిల్లా వ్యవసాయ మరియు అనుబంధిత శాఖల అధికారులు, పదర మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు హాజరయ్యారు.

# బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కట్టంగూర్ : అమృత్ తెలంగాణ:బాలల చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్ అన్నారు శనివారం అంబటివాగులో బాలల చట్టాలపై, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ.. బాల్యవివాహాలతో బాలికలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. గ్రామాల్లో బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దత్తత, మిషన్ వాత్సల్య పథకం, బాల్యవివాహాల ప్రభావం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఏనుగు సైదులు, పులకరం శ్రీను, ఎకుల సుజాత సైదులు, శ్రీరామ్ సంధ్య వీరేశం, కళ్లెం నాగేశ్వరరావు, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది రేవతి, అశ్వితా ఎన్జీవో శోభారాణి,ఝాన్సీ, కవిత అంగన్వాడి టీచర్ సైదమ్మ ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలి

మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన పంట అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్య రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా నాయకులు రాజేశ్వర్, పల్లె తిరుపతి, మండల అధ్యక్షులు నరేష్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని మున్ననూర్, రాణి పేట గ్రామాలలో వడ్లు కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్రంగా విఫలమైందని, రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆరోపించారు. తూకాల్లో మోసాలు కొనుగోలు కేంద్రాలలో అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 కిలోల బస్తాకు 42 కిలోల వరకు తూకం వేసి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని అని ఆవేదన వ్యక్తం చేశారు. చెల్లింపుల్లో జాప్యం ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ, రైతులకు సకాలంలో డబ్బులు జమకావడం లేదని వారు ఆరోపించారు. నేను రోజుల నుండి రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే నిద్రిస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, అధికారులు స్పందించి సకాలంలో



వరి కొనుగోలను చేసి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున రైతులతోపాటు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, ఆంజనేయులు వినోద్, రాజు, రాహుల్ నాయక్, ఆనంద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


# వ్యవసాయ క్షేత్రంలో అగ్నిప్రమాదం..

ఆలేరు .అమృత్ తెలంగాణ: ఆలేరు పట్టణ శివారులో పార్థసారథి వ్యవసాయ క్షేత్రంలో శనివారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పశువుల కోట్టము, 200 నాటు కోళ్లు మంటల్లో కాలిపోయాయి. దీంతో పాటు వ్యవసాయ సామగ్రి, పశుగ్రాసం, అగ్నికి ఆహుతయ్యాయి. అంతే కాదు కరెంటు మోటార్లు దగ్ధమయ్యాయి. మామిడి తోటకు చెందిన చెట్లు, పంటలు కాలిపోయాయి. అదేవిధంగా ప్రమాదంలో డ్రిప్ పైప్‌లైన్ పూర్తిగా దగ్ధమైంది. కరెంటు వైర్లు, పశుగ్రాసంగా నిల్వ ఉంచిన పచ్చి సోప్ప కూడా మంటల్లో కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా



తెలియరాలేదు. సంబంధిత అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి నష్టంపై అంచనా వేయాల్సి ఉంది. రైతుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వలన లక్షల్లో నష్టపోయామని బాధిత రైతు వాపోయారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మమ్ములను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పవన్ కళ్యాణ్ నుంచి ఆ విషయం నేర్చుకోవాల్సిందే!



హీరోయిన్లు ఎవరైనా సరే టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్తారు. కానీ నిధి అగర్వాల్ మాత్రం బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చి ఇక్కడే సెటిలైపోయింది. నిధి అగర్వాల్ మాత్రం బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చి ఇక్కడే సెటిలైపోయింది. మున్నా మైఖెల్ సినిమాతో హిందీ సినీ పరిశ్రమకు పరిచయమైన నిధికి ఆ సినిమా తర్వాత తెలుగులో అవకాశాలొచ్చాయి. దీంతో అమ్మడు టాలీవుడ్ లోనే సినిమాలు చేసుకుంటూ ఇక్కడే ఉండిపోయింది. తాను ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా వచ్చానని, సినిమాల్లోకి రావడమే తనకు సక్సెస్ తో సమానమని చెప్తున్న నిధి, తాను నమ్మిన కథలను మాత్రమే సెలెక్ట్ చేసుకుని, వాటిపైన మాత్రమే ఫోకస్ చేస్తానని అంటోంది. వరుసగా కమర్షియల్ సినిమాలు చేయడానికి తానేమీ హీరోని కాదని, ఒకవేళ అలా చేసినా అన్నీ ఒకే తరహా సినిమాలు చేస్తున్నానని విమర్శిస్తారని, అందుకే గొప్ప కథలను ఎంచుకుని మరీ చేస్తున్నట్టు నిధి పేర్కొంది అయితే కెరీర్ స్టార్టింగ్ నుంచి యంగ్ హీరోలతోనే సినిమాలు చేసుకుంటూ వచ్చిన నిధి ఒక్క స్టార్ హీరోతో కూడా కలిసి నటించింది లేదనుకుంటున్న టైమ్ లో అమ్మడికి ఒకేసారి పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న హరిహర వీరమల్లుతో పాటూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో అవకాశాలొచ్చాయి. ఒకేసారి ఇద్దరు స్టార్ హీరోల సరసన ఛాన్స్ రావడంతో నిధి కెరీర్ టర్న్ అయిపోతుం దనుకున్నారంతా. కానీ ఆ సినిమాలు ఇప్పటివరకు రిలీజైంది లేదు. ఏదో కారణాలతో సినిమాలు వాయిదాల మీద వాయిదాలు పడుతుండటంతో చేసేదేమీ లేక నిధి ఆ సినిమాల రిలీజుల కోసం వెయిట్ చేస్తుంది. ఇదిలా ఉంటే ఆ ఇద్దరు హీరోలతో కలిసి నటించిన వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ను నిధి తాజాగా ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. లైలా స్థానం ఎంతంటే? వీరమల్లు కోసం తాను ప్రత్యేకంగా గుర్రపు స్వారీ, కథక్ నేర్చుకున్నానని, పవన్ తో కలిసి నటించే అవకాశం రావడమే తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పిన ఆమె, ఆయన సెట్స్ లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారని, యాక్షన్ అని చెప్పగానే చుట్టుపక్కల ఏం జరుగుతుందో కూడా పట్టించుకోకుండా తన పాత్రలోకి వెళ్తారని, ఆయన్ను చూసి ఆ క్వాలిటీని అలవాటు చేసుకోవాలనుకుంటున్నట్టు చెప్పింది నిధి.

# సెకండ్ ఇన్నింగ్స్ కి రెడీ అంటున్న ముద్దుగుమ్మ..!

బెంగళూరు భామ ప్రణీత నటించిన తక్కువ సినిమాలతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకోకపోయినా సరే ప్రణీత అంటే ఇష్టపడే ప్రేక్షకులు కూడా ఉన్నారని చెప్పొచ్చు. కన్నడంలో పోకిరి రీమేక్ సినిమాతో తెరంగేట్రం చేసిన ప్రణీత తెలుగులో కూడా సినిమాలు చేసింది. యువ హీరోలు తనీష్ రామ్ సినిమాల్లో నటించిన ప్రణీత సుభాష్ పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో కూడా నటించి మెప్పించింది. ఓ పక్క సినిమాలు చేస్తూనే సడెన్ గా అమ్మడు పెళ్లి చేసుకుని షాక్ ఇచ్చింది. బిజినెస్ మెన్ నితిన్ రాజ్ తో ప్రణీత పెళ్లి అందరిని సర్ ప్రైజ్ చేసింది. ప్రణీతకి అప్పుడే పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేకపోయినా నితిన్ రాజ్ పెళ్లి ప్రపోజల్ తెచ్చే సరికి ఆమె కాదనలేకపోయిందట. ఈ జూన్ లో ఒక బేబీకి కూడా జన్మనిచ్చింది ప్రణీత. ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ప్రణీత కరోనా లాక్ డౌన్ టైం లో తన సోషల్ యాక్టివిటీస్ తో ప్రేక్షకులను అలరించింది. తనవంతు సాయంగా కొవిడ్ లాక్ డౌన్ టైం లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసింది ప్రణీత. ఇక ఇప్పుడు ప్రణీత మళ్లీ సినిమాలు చేసేందుకు రెడీ అంటుంది. సెకండ్ ఇన్నింగ్స్ గురించి మాట్లాడుతూ




ఒక మదర్ గా నా కర్తవ్యాన్ని పూర్తి చేశాను.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ చెప్పింది. పాపని పుట్టగానే నీ కర్తవ్యం పూర్తయిందా అంటూ ప్రణీత మీద నెటిజెన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే భర్త ఎంత బిజినెస్ మెన్ అయినా కూడా తనకంటూ ఒక జాబ్ రోల్ ఉండాలని మళ్లీ తనకు ఇంత క్రేజ్ తెచ్చిన సినిమాల పైనే ఫోకస్ చేయాలని చూస్తుంది ప్రణీత. అందుకే తన ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అలరిస్తుంది. ఈమధ్యనే మళ్లీ తన హాట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది ప్రణీత.

# ఎన్టీఆరా.. మజాకా.. జపాన్ భాషలో రప్ఫాడించాడు..!

మెగా పవర్ స్టార్ రాంచరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్లో తెరకెక్కిన మూవీ 'ఆర్ఆర్ఆర్ (రౌద్రం రణం రుధిరం). మెగా నందమూరి అభిమానులతోపాటు యావత్ ఇండియన్ ప్రేక్షకులను 'ఆర్ఆర్ఆర్' మూవీ ఓ రేంజులో ఆకట్టుకుంది. విడుదలకు ముందు నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచిన రాజమౌళి అందుకు తగ్గట్టుగానే 'ఆర్ఆర్ఆర్'ను తెరకెక్కించింది.'అల్లూరి'గా రాంచరణ్ కొమురంభీంగా రాంచరణ్ సీతగా అలియాభట్ బ్రిటిష్ ప్రిన్సెస్ గా ఓలివియాలు నటించారు. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ వెటరన్ బ్యూటీ శ్రియ శరణ్ సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పి నిర్మాతలకు కాసులవర్షం కురిపించింది. తాజాగా ఈ మూవీని జపాన్ భాషలోనూ విడుదల చేస్తున్నారు. ఈక్రమంలోనే 'ఆర్ఆర్ఆర్' బృందం జపాన్ రాజధాని టోక్యోలో పర్యటిస్తోంది. ఉదయం నుంచే రాంచరణ్ ఉపాసన ఎన్టీఆర్ ప్రణతి రాజమౌళి రమ తదితరులు 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్స్ ను ఓ రేంజులో చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు వీడియోలు నెట్టింట్లో వైరల్ గా మారాయి. కొద్దిసేపటి క్రితమే 'ఆర్ఆర్ఆర్' బృందం టోక్యో వీధుల్లో 'దోస్తీ' పాటకు సందడి చేస్తూ రోడ్డును దాటారు. ఈ వీడియోను ఎన్టీఆర్ రాంచరణ్ పోస్టు చేయగా వైరల్ అయింది. అయితే తాజాగా ఎన్టీఆర్ అభిమానులు మరో వీడియోను నెట్టింట్లో వైరల్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా టోక్యోలో 'ఆర్ఆర్ఆర్' టీం మీడియా ప్రెస్ మీట్ నిర్వహించింది. అయితే ఎన్టీఆర్ ఎవరూ ఊహించని విధంగా జపాన్ భాషలో మాట్లాడి అక్కడి వారిని ఆకట్టుకున్నాడు. జపాన్ భాషలో అభిమానులను పలుకరించడంతోపాటు వారిని ఉత్తేజపరిచాడు. సుమారు 70 సెకన్ల నిడివితో ఉన్న ఈ వీడియో ఎన్టీఆర్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.






అవనీత్ కౌర్ హాట్ ఇన్ శారీ

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com